క్లుప్తంగా

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్‌: ఆధ్యాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నాన్‌సింధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే బొడ్రాయి పండుగకు హాజరుకావాలని సోమవారం గ్రామస్తులు అవినాశ్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు విరాళంగా రూ.1లక్ష నగదును అందజేశారు. అనంతరం శివస్వాములకు ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొన్న వెంకటర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా అనంతపద్మనాభ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకకు వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి, కేశంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు విశాల, కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సిద్దార్థరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రమేశ్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



క్షేత్రస్థాయిలో పంటల సాగుపై సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పంటల సాగులో అనుసరించాల్సిన మెలకువలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పంటల సాగుకు ముందు రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేపట్టాలని సూచించారు. భూసార పరీక్షలతో పొలాల్లో ఉన్న పోషకాలు తదితర సమాచారం తెలుస్తుందన్నారు. ముఖ్యంగా వరుసగా ఒకే రకమైన పంటలు కాకుండా పంటమార్పిడి విధానంతో దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలిపారు. చీడ పీడల నివారణ, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రామాంజనేయులు, చైతన్య, ఏఓ గోపాల్‌నాయక్, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతోనే విజయాలు

జాతీయ బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్



విద్యార్థిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న జాతీయ బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్‌: విద్యార్థులు ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే విజయతీరాలకు చేరుకుంటారని జాతీయ బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. ఎప్‌సెట్ 2025 ఫలితాలలో పట్టణానికి చెందిన రెబ్బ చందన రాష్ట్ర స్థాయిలో 1500ల ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా జాతీయ బీసీసేన మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు బాస వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం చందనతో పాటు ఆమె తల్లిదండ్రులు లావణ్య, విజయ్‌కుమార్‌ను ఆయన సన్మానించారు. విద్యార్థి ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీసేన నాయకులు జక్కుల జలజ, సుధాకర్, ప్రశాంత్, చంద్రశేఖర్, వెంకటేశ్, చంద్రశేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న మలుపు



గూడూరు-పెద్దగుట్టతండా రోడ్డులో ప్రమాదకరంగా మారిన మలుపు

మలుపులు.. మృత్యుపిలుపులు

- సూచిక బోర్డులు లేక తరచూ రోడ్డు ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తూరు: ప్రమాదకరంగా మారిన మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని ప్రమాదాల్లో వాహనదారులు మృత్యువాత సైతం పడుతున్నారు. మరెందరో వాహనదారులు క్షతగాత్రులుగా మారుతున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ప్రమాదాలకు అవకాశం ఉన్న మలుపులను గుర్తించడం లేదు. కనీసం ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు సైతం చేపట్టడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ఉన్న మూలమలుపులు వాహనదారుల పాలిట యమపురికి పిలుపులుగా మారుతున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు

- కొత్తూరు నుంచి సిద్దాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో కొడిచర్ల శివారులో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపు సీ అకారంలో ఉండడంతో దగ్గరకు వెళ్లే వరకు వాహనదారులకు కనిపించడం లేదు. ఇక్కడ తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- తిమ్మాపూర్ నుంచి మల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో అక్కివానిగూడ సమీపంలో ఎస్ అకారంలో ఉన్న మలుపు వద్ద వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో జరిగిన పలు ప్రమాదాల్లో ఇద్దరు బీటెక్ విద్యార్థులతో పాటు పలువురు స్థానికులు వాహనాలు అదుపుతప్పి కింద పడడంతో మృత్యువాతపడ్డారు.
- గూడూరు నుంచి పెద్దగుట్ట తండా, మల్లాపూర్ ఎస్సీ కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ఉన్న మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే ఈ మలుపుల వద్ద చోటు చేసుకున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు.

రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలం

ప్రమాదకరంగా మారిన మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు విఫలమవుతున్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా మలుపుల వద్ద సూచిక బోర్డులు, వేగ నిరోధకాలు సైతం ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఈ రోడ్లగుండా కొత్తగా ప్రయాణం చేసేవారు, స్థానికులు వాహనాలు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



అధికారులు ప్రమాదకరంగా మారిన మూల మలుపులను గుర్తించాలి. మలుపుల వద్ద వాహనదారులకు కనిపించే విధంగా సూచికబోర్డులు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే సాధ్యమైనంత వరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది.

– ఎర్రోళ్ల జగన్, పెంజర్ల

చర్యలు తీసుకోవాలి



మలుపుల వద్ద వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మద్యం తాగి, రాత్రివేళల్లో అతివేగంగా వాహనాలు నడిపినప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

– సురేష్, గూడూరు

భూ భారతితో శాశ్వత పరిష్కారం



రైతుల వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌తో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దుచేసి భూ భారతితో అర్హులైన రైతులకు భూములపై హక్కులను కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులతో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, సీతారాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మొయినాబాద్‌: షాద్‌నగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లికి చెందిన బసగళ్ల దయానంద్‌గౌడ్ నియమితులయ్యారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు షాద్‌నగర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దయానంద్‌గౌడ్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా యువజన కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తూ సేవలందించానన్నారు. యువజన కాంగ్రెస్ విస్తరణ కోసం చేసిన కృషిని గుర్తించి షాద్‌నగర్ నియోజవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మొయినాబాద్‌రూరల్‌: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నదీమ్‌నగర్, కాశీంబౌలి గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ప్రతీ సంవత్సరం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యానోత్సవాలు

కేశంపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ధ్యానోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు శివాజీ తెలిపారు. మంగళవారం నుంచి మూడురోజుల పాటు హార్ట్‌ఫుల్‌నెస్ రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధ్యానోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ధ్యాన శిబిరం ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 7.30 నిమిషాల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని గ్రామస్తులతో పాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించేందుకు చర్యలు

ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: ఇందిరమ్మ ఇళ్ల పథానికి సంబంధించి లబ్ధిదారులకు సరైన ప్రోత్సాహకం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ హిమబిందు, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మెటీరియల్ ప్రైస్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల, మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మెటీరియల్స్ ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రిని తక్కువ ధరలకు సరఫరా చేసే విధంగా చూడాలని, అప్పుడే పేదలు వారి సొంతింటి కలను నిజం చేసుకుంటారని సమావేశంలో నిర్ణయించారు. ఈ దిశగా మండలాల వారీగా కమిటీల ద్వారా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని వెల్లడించారు. ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన మేస్త్రీలను కూడా ఏర్పాటు చేసే విధంగా ఈ కమిటీ పనిచేస్తోందన్నారు. మండలం, మున్సిపాలిటీ మొత్తం కలిపి 700ల ఇళ్లు మంజూరయ్యాయని, అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నెలరోజుల్లో తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. దీనికి సంబంధించి గ్రామాల్లో లబ్ధిదారులకు కార్యదర్శుల ద్వారా సమాచారం అందిస్తామని చెప్పారు. మండలంలో రాజీవ్ యువ వికాస్ కింద కూడా 1,377 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీరికి సంబంధించిన పరిశీలన పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ ప్రభాకర్, మేస్త్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ హిమబిందు, కమిషనర్ పూర్ణచందర్ తదితరులు

రైతు భరోసాను సద్వినియోగం చేసుకోండి

ఏఓ రాజేందర్‌రెడ్డి



రైతు భరోసాపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కొందుర్గు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి(ఏఓ) రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రావిర్యాల గ్రామంలో రైతు భరోసాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు భరోసా పథకానికి 2025 జనవరి వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు అర్హులన్నారు. రైతు భరోసా కోసం రైతులు తమ ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఎన్‌రోల్‌మెంట్ ఫాం, పట్టాదారు పాసుపుస్తకాలు జతచేసి సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)కి అందించాలని సూచించారు. కొత్త పట్టాదారు పాస్తకాలు వచ్చిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

షాద్‌నగర్‌రూరల్‌: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులను తీసుకొచ్చి హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు విమర్శించారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను సోమవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని ముఖ్య కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్వతాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా చట్టాలను మార్చుతోందని ఆరోపించారు. కార్మికులు కోల్పోయిన చట్టాలను తిరిగి పొందడానికి జరిగే పోరాటంలో కార్మికులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలుచేసే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 20న సార్వత్రిక సమ్మెకు దిగుతున్నారని, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్యాక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, కేశంపేట మండల కార్యదర్శి గోవిందు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రబాబు, నాయకులు గోపాల్, రాజు, రవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజీవ్ యువ వికాస్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు దివ్యాంగుల వినతి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల విభాగం నాయకులు

మొయినాబాద్‌: రాజీవ్ యువ వికాస్ పథకంలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నర్సింహాచారి ఎమ్మెల్యే కాలె యాదయ్యకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం మొయినాబాద్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కార్పొరేషన్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవకాశం కల్పిస్తామని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారు జీవన విధానాన్ని మెరుగు పర్చుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందుకోసం తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎం.సురేష్, సభ్యులు జ్ఞానేశ్వర్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



నగదు అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం

షాద్‌నగర్‌: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో పునర్నిర్మించిన శివమారుతీ రామాలయంలో గణపతి, శ్రీరామచంద్రమూర్తి, అభయాంజనేయస్వామి, కాశీవిశ్వేశ్వర నందీశ్వర, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం తనవంతుగా రూ.1,11,111ల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు విరాళంకు సంబంధించిన నగదును ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ నారందినేశ్‌రెడ్డికి అందజేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీఅంబభవానీమాత దేవాలయ కమిటీ చైర్మన్ ముత్యాలరాజు, డైరెక్టర్ ఎంకనోళ్ల శివ, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ డైరెక్టర్ యాదగిరి, మాజీ చైర్మన్ సురేందర్, మాజీ వార్డు సభ్యుడు శ్రీపాదరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రామన్నగూడ గ్రామంలో సోమవారం సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు పెంచుతామని మోసం చేసిందన్నారు. రైతులకు రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు ఎర్ర జెండా ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. గ్రామ గ్రామాన సీపీఐ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బుల్, నాయకులు మీనాక్షి, రామన్నగూడ శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా పాపయ్య, సహాయ కార్యదర్శిగా కిష్టయ్య, అన్వర్, బాలయ్య, రఫిక్, యూసూఫ్, నర్సింలు, తాజ్, అంజయ్య, నర్సింలు, నాగేశ్, శ్యామలయ్య ఉన్నారు.

అర్హుల జాబితాపై అవగాహన ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ఇళ్ల నిర్మాణం 60గజాలలోపు ఉండాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, ఏపీఓ నాగభూషణం పాల్గొన్నారు.